## విలేకరులు కావలెను

హిందుస్థాన్ మీడియా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో జిల్లా రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జులు, మండలాలవారిగా విలేకరులు కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి
9000306455



hindustanmedia333@gmail.com APTEL / 2004 / 19136

# హిందుస్థాన్ మీడియా

తెలుగు దిన పత్రిక

సామాన్యుడి నేస్తం

ఎడిటర్ : తాడెం. ప్రశాంత్ సిద్దిపేట సంపుటి : 1 సంచిక : 49 బుధవారం జూన్ 17 2026, పేజీలు - 4 వెల :2/-







## ఇంటి నుంచే యూరియా బుకింగ్ చేసుకునే సౌకర్యం

హిందూస్థాన్ మీడియా



రైతులకు పారదర్శకంగా యూరియా పంపిణీ చేస్తామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.
మంగళవారం కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో మంత్రి మాట్లాడుతూ.. క్యూ లైన్లు అవసరం లేకుండా ఇంటి నుంచే యూరియా బుకింగ్ చేసుకునే సౌకర్యాన్ని రైతులకు కల్పిస్తామన్నారు. ఫర్టిలైజర్ యాప్ ద్వారా ఇప్పటికే 4.06 లక్షల మంది రైతులు బుకింగ్ చేసుకున్నారని వివరించారు. మొత్తం13.22 లక్షల యూరియా బస్తాల బుకింగ్ చేసుకుంటే.. 84.6 శాతం పంపిణీ పూర్తి చేశామని తెలిపారు. రాష్ట్రంలో 90.22 లక్షల యూరియా బస్తాల భారీ నిల్వలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రైతుల సూచనలతో ఫర్టిలైజర్ యాప్‌లో నిరంతర మార్పులు చేస్తున్నట్లు చెప్పారు. స్మార్ట్ ఫోన్ లేని రైతులకు టోల్ ఫ్రీ ద్వారా యూరియా బుకింగ్ చేసుకునే అవకాశాన్ని కల్పించామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ టోల్ ఫ్రీ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ యాప్ వినియోగంలో నిజామాబాద్ జిల్లా రైతులు రాష్ట్రంలో ముందంజలో ఉన్నారని ప్రశంసించారు. యూరియా బ్లాక్ మార్కెటింగ్, అక్రమ రవాణాకు చెక్ పెట్టేందుకే ఈ డిజిటల్ విధానం అమల్లోకి తీసుకొచ్చినట్లు వివరించారు. నిజమైన రైతులకు మాత్రమే ఎరువులు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావం ఉన్నా యూరియా కొరత రానివ్వమని రైతులకు ఈ సందర్భంగా మంత్రి తుమ్మల భరోసా కల్పించారు. పెద్దరైతులు ఆందోళన చెంద వద్దని.. అందరికీ సమానంగా ఎరువుల పంపిణీ చేస్తామన్నారు. అధిక యూరియా వినియోగం భూసారానికి హానికరం అని రైతులను ఆయన హెచ్చరించారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది తక్కువ వర్షాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని రైతులకు స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలంటూ రైతులకు మంత్రి తుమ్మల సూచించారు. అధిక నీటి అవసరం ఉన్న వరికి బదులు ఆయిల్ పామ్ వంటి లాభసాటి పంటల వైపు వెళ్లాలని రైతులకు స్పష్టం చేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో రైతాంగానికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని రైతులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసా కల్పించారు.

## బీజేపీ తొత్తుగా కేంద్ర ఎన్నికల సంఘం

హిందూస్థాన్ మీడియా




ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్ అని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. అలాంటి దేశంలో కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) బీజేపీకి తొత్తుగా మారిందని ఆరోపించారు. 2002లో ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని.. కానీ ప్రస్తుతం వారికి ఓట్లు పడవనుకుంటే వాటిని తొలగిస్తుందన్నారు. మతతత్వ పార్టీలకు ప్రయోజనం చేకూరేలా ఎస్ఐఆం ప్రక్రియ నిర్వహించే కుట్ర జరుగుతుందని విమర్శించారు. మంగళవారం సంగారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్‌పై బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్‌లో ఎస్ఐఆర్ పేరుతో 92 లక్షల ఓట్లను అక్రమంగా తొలగించారని వివరించారు. ఈ ఎస్ఐఆర్ ప్రక్రియలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డితోపాటు తన ఓటు గల్లంతు అయినా ఆశ్చర్య పోనక్కర్లేదని మహేశ్ కుమార్ గౌడ్ వ్యంగ్యంగా అన్నారు. తమ ఓట్లు క్షేమంగా ఉండాలంటే బీఎల్ఏ కీలకంగా పని చేయాల్సి ఉందని చెప్పారు. రాజకీయాల్లో తనకు దామోదర రాజనర్సింహ ఓనమాలు నేర్పించారని గుర్తు చేసుకున్నారు. ఈ దేశంలో అతికొద్దిమంది నిజాయితీపరుల్లో మీనాక్షి నటరాజన్ ఒకరని పేర్కొన్నారు. ఆ కారణంతోనే ఆమె రాజ్యసభ నామినేషన్ పత్రాన్ని తిరస్కరించారని తెలిపారు. బీజేపీ వాళ్లకి కనికరం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరంతరం అధికారంలో ఉండి చక్రవర్తుల్లా ఉండాలని బీజేపీ నేతలు అనుకుంటున్నారని వ్యాఖ్యానించారు. మీ కంటే పెద్ద చక్రవర్తులే నేలమట్టం అయ్యారు.. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాలు ఎంత..? అని ప్రశ్నించారు. అధికారం శాశ్వతం అనుకుంటే.. వారు మూర్ఖులే అవుతారన్నారు. దేవుళ్లకు ఎవరు వ్యతిరేకం కాదని.. కానీ దేవుడి పేరు చెప్పనిదే బీజేపీ వాళ్లకు ఓట్లు పడవన్నారు. ఏడాదిలో చాలాసార్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పూజలు నిర్వహిస్తారని.. కానీ దేవుళ్ల పేరుతో తాము ఓట్లు అడగమన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని ప్రకటించి.. ఉన్న ఉద్యోగాలను తీసేస్తున్నారంటూ కేంద్రంపై టీపీసీసీ చీఫ్ నిప్పులు చెరిగారు. ఈ కార్యక్రమంలో మంత్రి దామోదర రాజనర్సింహ, టీజీఐఐసీ చీఫ్ నిర్మలా జగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు.

### మీ కుట్రలు ప్రజలు గమనిస్తున్నారు: టీపీసీసీ చీఫ్

జనసేన పార్టీ అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెనుక బీజేపీ ఉందని టీపీసీసీ చీఫ్ విమర్శించారు. కమలం పార్టీ ఆడించినట్టే.. ఆయన ఆడుతున్నారని ఆరోపించారు. మీ సానుభూతి తమకేం అవసరం లేదని పవన్‌కు స్పష్టం చేశారు. మీ కుట్రలు ప్రజలు గమనిస్తున్నారని పవన్‌కు సూచించారు. తెలంగాణ వచ్చినప్పుడు 10 రోజులు అన్నం తినలేదని పవన్ వ్యాఖ్యలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

### కిషన్ రెడ్డికి టీపీసీసీ చీఫ్ కౌంటర్

ఈ 12 ఏళ్లలో తెలంగాణకు ఏం చేశారో చిట్టా ఇవ్వాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ఆయన కౌంటర్ ఇచ్చారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి ఇంకా నిధులు రావాల్సి ఉందన్నారు. విభజన హామీలను ఇప్పటి వరకు నెరవేర్చలేదంటూ కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు సబర్మతిని కట్టుకోవచ్చు.. తాము మూసి ప్రక్షాళన చేస్తామంటే మాత్రం నిధులు ఇవ్వరని కేంద్రంపై అసహనం వ్యక్తం చేశారు. వీటికి సమాధానం చెప్పాలంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి స్పష్టం చేశారు. ఓ వైపు బీజేపీ, మరో వైపు బీఆర్ఎస్ పార్టీలు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక పోతున్నారని పేర్కొన్నారు.

## బోనస్ ఇచ్చే 7 రకాల సన్న వడ్లు అందుబాటులో ఉంచాలి

హిందూస్థాన్ మీడియా




ధాన్యం దిగుబడిపైన వ్యవసాయ శాఖకు సంపూర్ణ అవగాహన ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. రైతు వేదికలో విత్తనాలు అందుబాటులో ఉంచాలని మార్గనిర్దేశం చేశారు. సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించాలని ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో వ్యవసాయ శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. బోనస్ ఇచ్చే 7 రకాల సన్న వడ్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. 7 రకాల సన్న వడ్లను సబ్సిడీపైన ఇవ్వాలని మార్గనిర్దేశం చేశారు. భద్రాద్రి కొత్తగూడం దమ్మపేట మండలంలో ప్రారంభించిన పైలెట్ ప్రాజెక్ట్‌ను మరింతగా వినియోగించుకోవాలని సూచించారు.

### వ్యవసాయ శాఖలో సాంకేతికతను మరింత పెంచుకోవాలి..

వ్యవసాయ శాఖలో సాంకేతికతను మరింతగా పెంచుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఏఐని మరింతగా వినియోగించాలని నిర్దేశించారు. అగ్రికల్చర్ యూనివర్సిటీని నోడల్ ఏజెన్సీగా పెట్టుకొని సాంకేతికతను పెంచుకోవాలని సూచించారు. సీడ్స్ నుంచి కొనుగోలు వరకు వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్, అగ్రికల్చర్ యూనివర్సిటీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మార్క్‌ఫెడ్ నష్టాలను తగ్గించుకునే ప్రయత్నాలు చేయాలని పేర్కొన్నారు. ఆయిల్ ఫెడ్‌ను బలోపేతం చేసుకోవాలని తెలిపారు. అన్ని వ్యవసాయ మందులకు సంబంధించి ఓ యాప్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యాప్ ద్వారా బుక్ చేసుకునే యూరియాను రైతు వేదిక ద్వారా పంపిణీ చేయాలని అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్‌కు యూరియా పంపిణీ బాధ్యతను అప్పగించాలని ఆదేశించారు. యూరియా, ఇతర ఎరువుల కేటాయింపులపై ఎప్పటికప్పుడూ కేంద్రప్రభుత్వానికి లేఖలు రాయాలని ఆదేశించారు.

### కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి..

రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయిన ఎరువులు మొత్తం తెలంగాణకే ఇచ్చేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఎరువుల పరిస్థితిపైన అన్ని పార్టీల ఎంపీలతో ఓ సమావేశం నిర్వహించి పరిస్థితిని వివరించాలని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.



## పెండింగ్ బిల్లులు పూర్తిగా చెల్లిస్తాం

### -చిన్న కాంట్రాక్టర్లకు డిప్యూటీ సీఎం హామీ

హిందూస్థాన్ మీడియా

చిన్న కాంట్రాక్టర్లకు ఈ ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు. పెండింగ్ బిల్లులను దశలవారీగా పూర్తిగా చెల్లిస్తామని వారికి హామీ ఇచ్చారు. మంగళవారం హైదరాబాద్ గ్రీన్‌లాండ్స్‌లోని ప్రజాభవన్‌లో భట్టితో బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు భేటీ అయ్యారు. చిన్న కాంట్రాక్టర్ల సమస్యలపై మానవీయ కోణంలో స్పందిస్తామని వారికి ఆయన హామీ ఇచ్చారు. చిన్న కాంట్రాక్టర్ల బకాయిల క్లియరెన్స్‌కు ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్తుందన్నారు.ప్రతినెలా నిరంతరాయంగా బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయని వివరించారు. తమ సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం పట్ల కాంట్రాక్టర్లు హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి కోమటిరెడ్డికి బిల్డర్ అసోసియేషన్ కృతజ్ఞతలు తెలిపింది. డిప్యూటీ సీఎం భట్టి హామీతో జూన్ 18వ తేదీన తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు ఈ సందర్భంగా బిల్డర్ అసోసియేషన్ ప్రకటించింది.

# ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పిస్తే.. ఇంటి పన్ను, నల్లా పన్ను మాఫీ!

**-బైరాన్‌పల్లి గ్రామ పంచాయతీ పాలకవర్గం సంచలన, ఏకగ్రీవ తీర్మానం**

**-'మన ఊరు-మన బడి' రక్షణకు సర్పంచ్ బర్మా రాజమల్లయ్య అద్భుత ముందడుగు**

ధూళిమిట్ట/బైరాన్‌పల్లి (హిందూస్తాన్ మీడియా):
ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు, ప్రైవేటు పాఠశాలల వైపు వెళ్తున్న విద్యార్థులను సర్కారు బడి వైపు మళ్లించేందుకు సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలం బైరాన్‌పల్లి గ్రామ పంచాయతీ ఆదర్శంగా నిలిచే ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే కుటుంబాలకు 'ఇంటి పన్ను, నల్లా పన్ను' పూర్తిగా మాఫీ చేస్తూ గ్రామ పంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. మంగళవారం గ్రామ పంచాయతీ సర్పంచ్ బర్మ రాజమల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన అత్యవసర గ్రామ సభలో ఈ సంచలన నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించారు.

**-మన ఊరు-మన బడిని కాపాడుకుందాం!**

ఈ సందర్భంగా సర్పంచ్ బర్మ రాజమల్లయ్య మాట్లాడుతూ.. "మన ఊరు-మన బడి.. మనం కాపాడుకుందాం" అనే నినాదంతో గ్రామంలోని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రైవేట్ పాఠశాలలకు వేల రూపాయలు తగలేస్తూ అప్పులపాలు కాకుండా, నూతన విద్యా సంవత్సరం (అడ్మిషన్స్) సందర్భంగా తమ పిల్లలను స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే తల్లిదండ్రులకు ఈ పన్నుల మాఫీ వర్తిస్తుందన్నారు. గ్రామంలో ప్రభుత్వ విద్యను ప్రోత్సహించేందుకు పాలకవర్గ సభ్యులందరి ఆమోదంతోనే ఈ ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు ఆయన స్పష్టం చేశారు.

**-ప్రైవేటుకు దీటుగా సర్కారు బడి సదుపాయాలు..**

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ సంస్థలకు దీటైన ఉచిత సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని సర్పంచ్ వివరించారు: నాణ్యమైన విద్య: అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన బోధనతో పాటు ఆధునిక డిజిటల్ తరగతులు. ఉచితాలు: విద్యార్థులందరికీ ఉచితంగా పాఠ్యపుస్తకాలు మరియు యూనిఫాంల పంపిణీ. వసతులు: పోషకాలతో కూడిన రుచికరమైన మధ్యాహ్న భోజనం, సురక్షిత తాగునీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు మరియు ఆటల కోసం క్రీడా సామగ్రి. గ్రామ ప్రజలు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ప్రైవేట్ వ్యాపార పాఠశాలలను



నమ్మకుండా తమ పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించి విద్యాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ ?కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి (MEO) మీనాంజనేయులు, మండల పరిషత్ అధికారి (MPO) రామ్మోహన్, పంచాయతీ కార్యదర్శి కట్కూరి రాజు, ఉపసర్పంచ్ తెలజిరి సిద్దులు,?అలాగే వార్డు సభ్యులు పెర్కా రమేష్, జంగిటి మనోజ్, దాసరి సుగుణ, కత్తుల రాజు, పులిగిల్ల లలిత, కాలి జంపన్న, కొత్తపల్లి బాపురాజు, మోటం వినోద, పుప్పాల సింధుప్రియ, ఫీల్డ్ అసిస్టెంట్ ఉమేష్, ఐకేపీ వెలుగు సీఏలు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ నిర్ణయాన్ని హర్షించారు.

# ఈ నెల 19న చేర్యాలలో 'మెగా రక్తదాన శిబిరం'

**-రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయండి: మాజీ ఎంపీపీ డాక్టర్ ఆర్. పరమేశ్వర్ పిలుపు**

**-ముఖ్య అతిథిగా హాజరుకానున్న చేర్యాల సీఐ బానోత్ రమేష్ నాయక్**

**-రక్తదాతలకు ఉచిత హెల్త్ రిపోర్ట్స్, లైఫ్ టైమ్ బ్లడ్ కార్డ్స్: బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి పిన్న రమేష్**



చేర్యాల (హిందూస్తాన్ మీడియా):
చేర్యాల మండల కేంద్రంలోని అక్షయ హాస్పిటల్‌లో ఈ నెల 19వ తేదీ (శుక్రవారం) హైదరాబాద్‌లోని న్యూ మలక్‌పేట్ బ్లడ్ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో భారీ 'మెగా రక్తదాన శిబిరం' నిర్వహించనున్నట్లు అక్షయ ఆసుపత్రి అధినేత, మాజీ ఎంపీపీ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ తెలిపారు. మంగళవారం ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ శిబిరానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు.

**-ప్రాణదాతలుగా మారండి..**

ఈ సందర్భంగా డాక్టర్ పరమేశ్వర్ మాట్లాడుతూ.. ప్రపంచంలో అన్ని దానాల కంటే రక్తదానం, అవయవదానం అత్యంత శ్రేష్ఠమైనవని కొనియాడారు. మానవ శరీరంలో ప్రతి 120 రోజులకు ఒకసారి పాత రక్తకణాలు నశించి, కొత్త కణాలు పుడతాయని.. కాబట్టి ఆరోగ్యవంతులు రక్తదానం చేయడం వల్ల శరీరానికి ఎలాంటి నష్టం జరగకపోగా, అత్యవసర స్థితిలో ఉన్న తోటి ప్రాణాలను నిలబెట్టిన వారవుతారని పేర్కొన్నారు. 18 నుండి 65 సంవత్సరాల వయస్సు ఉండి, కనీసం 45 కిలోల బరువు ఉన్న ఏ ఆరోగ్యవంతమైన వ్యక్తి అయినా సురక్షితంగా రక్తదానం చేయవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ మానవీయ కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా చేర్యాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (CI) బానోత్ రమేష్ నాయక్ హాజరుకానున్నట్లు తెలిపారు.

**-రక్తదాతలకు బంపర్ ఆఫర్: ఉచిత టెస్టులు, లైఫ్ టైమ్ కార్డ్స్!**

న్యూ మలక్‌పేట్ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి పిన్న రమేష్ మాట్లాడుతూ.. ఈ శిబిరంలో రక్తదానం చేసే వారికి లభించే ప్రత్యేక ప్రయోజనాలను వివరించారు: ఉచిత హెల్త్ రిపోర్ట్స్: రక్తదాతల రక్తాన్ని సేకరించిన తర్వాత అన్ని రకాల వైద్య పరీక్షలు (టెస్టులు) ఉచితంగా చేసి, ఆ రిపోర్టులను అదే రోజు సాయంత్రం లోపు వారి వాట్సప్ (WhatsApp) నెంబర్లకు పంపుతాము. ఉచిత బ్లడ్ కార్డ్ (Certificate & Card): రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ అధికారిక ప్రశంసా పత్రంతో (Certificate) పాటు ప్రత్యేక గుర్తింపు కార్డు అందిస్తాము. లైఫ్ టైమ్ ఉచిత రక్తం: ఈ కార్డు ఉన్న వారికి లేదా వారి కుటుంబ సభ్యులకు భవిష్యత్తులో ఎప్పుడైనా, ఎక్కడైనా రక్తం అత్యవసరమైతే.. ఎలాంటి చార్జీలు లేకుండా రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా రక్తాన్ని సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు.

**-యువత, ప్రజలు తరలిరావాలి..**

చేర్యాల పట్టణంతో పాటు చుట్టుపక్కల పరిసర గ్రామాల్లోని యువకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో చిట్యాల, లెనిన్ నగర్ సర్పంచ్‌లు జానకి కృష్ణలీల-స్వామి, దాసరి పరశురాములు, డాక్టర్ రామగళ్ళ భూవన్ చతుర్వేది, గూడ నాగ శేఖర్ రెడ్డి, ఉప్పల రాములు, బసవగళ్ళ రమేష్, ర్యాకం ప్రభాకర్ గదరాజు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ తీర్మానాలు కాగితాలకే పరిమితం..

**-చేర్యాల బ్రిడ్జి వద్ద అసంపూర్తిగా 'మట్టి' పనులు!**

**-వర్షాకాలం ముంచుకొస్తున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న మున్సిపల్ యంత్రాంగం**

**-తవ్విన మట్టిని అక్కడే వదిలేశారు.. కాలనీలు మునిగాక స్పందిస్తారా? మండిపడుతున్న పట్టణ ప్రజలు**

చేర్యాల (హిందూస్తాన్ మీడియా):
వర్షాకాలం ముంచుకొస్తున్న తరుణంలో చేర్యాల మున్సిపాలిటీ పరిధిలో చేపట్టాల్సిన ముందస్తు రక్షణ చర్యలు, శానిటేషన్ పనులు కేవలం కాగితాలకే పరిమితమవు తున్నాయనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. పట్టణంలోని ప్రధాన బ్రిడ్జి (వంతెన) వద్ద వరద నీరు సజావుగా సాగిపోయేందుకు మున్సిపల్ అధికారులు తీసుకున్న నిర్ణయాలు, క్షేత్రస్థాయిలో వారి అనాలోచిత, కూటమంత్రపు వ్యవహారశైలి వల్ల ప్రజలకు శాపంగా మారేలా కనిపిస్తున్నాయి.

**-ఒక్కరోజు హడావిడి.. ఆపై అడ్రస్ లేరు!**

గత కొన్ని రోజుల క్రితం చేర్యాల బ్రిడ్జి వద్ద పేరుకుపోయిన మట్టి, చెత్తాచెదారాన్ని తొలగించేందుకు మున్సిపల్ అధికారులు కాగితాల మీద హడా విడిగా తీర్మానాలు చేశారు. వర్షాకాలం రాక ముందే తాము ఎంతో ముందుజాగ్రత్తగా వ్యవహరిస్తున్నామని కలరింగ్ ఇస్తూ, ఒకరోజు జేసీబీలతో అక్కడ హడావిడిగా మట్టిని తవ్వారు. అయితే, ఆ తర్వాత ఏమైందో ఏమో కానీ.. ఆ పనులను అక్కడితోనే అర్ధాంతరంగా వదిలేసి అధికారులు, కాంట్రాక్టర్లు చేతులు దులుపుకున్నారు.

**-తవ్విన మట్టిని అక్కడే కుప్పపోశారు..**



తవ్విన మట్టిని అక్కడే వదిలేసిన సిబ్బంది

మున్సిపల్ సిబ్బంది బ్రిడ్జి కింద పేరుకుపోయిన మట్టిని తవ్వడం వరకు బాగానే ఉన్నా.. ఆ తీసిన మట్టిని అక్కడి నుండి వేరే ప్రాంతానికి తరలించకుండా, నిర్లక్ష్యంగా బ్రిడ్జి పక్కనే పెద్ద ఎత్తున కుప్పలుగా పోశారు. ప్రస్తుతం ఆకాశంలో మబ్బులు కమ్ముకుని వర్షాలు పడే సమయం ఆసన్నమైంది. ఇప్పుడు గనక ఒక్క భారీ వర్షం పడితే.. పక్కనే కుప్పగా పోసిన మట్టి మొత్తం మళ్లీ కొట్టుకుపోయి నేరుగా బ్రిడ్జి కిందకే చేరుతుంది. దీనివల్ల వరద నీటి ప్రవాహానికి అడ్డుకట్ట పడి, నీరంతా వెనక్కి తన్ని చుట్టుపక్కల ఉన్న కాలనీల్లోని ఇళ్లలోకి చేరే ప్రమాదం స్పష్టంగా పొంచి ఉంది.

**-ఇళ్లు మునిగాక చూద్దాం అనుకుంటున్నారా?**

మున్సిపల్ అధికారులు కేవలం తీర్మానాల్లో 'మట్టి తవ్వాలి' అని మాత్రమే రాసుకున్నారా.. లేదా 'తవ్విన మట్టిని తరలించాలి' అనే స్పృహ మరిచారా? అని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "ఇప్పట్లో వర్షాలు పడవులే అని ధీమాగా ఉన్నారో.. లేక ముందుజాగ్రత్త మనకెందుకు, కాలనీల్లో ఇళ్లు మునిగిపోయి ప్రజలు అల్లాడిపోయాక అప్పుడు వచ్చి చూద్దాంలే అనుకుంటున్నారో అధికారులకే తెలియాలి" అంటూ పట్టణ ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా చేర్యాల మున్సిపల్ కమిషనర్, పాలకవర్గం మరియు సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి.. బ్రిడ్జి వద్ద కుప్పలుగా పోసిన మట్టిని యుద్ధప్రాతిపదికన అక్కడి నుండి తరలించాలి. వర్షాలు పడకముందే పనులను పూర్తి చేసి కాలనీ ప్రజలను వరద ముప్పు నుండి కాపాడతారా.

## ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్‌లో అడ్మిషన్లు ప్రారంభం! 3వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులకు సువర్ణ అవకాశంలి

**-అర్హులైన పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి: వార్డెన్ (HW0) ముత్యాల చక్రధర్**



మద్దూరు (హిందూస్తాన్ మీడియా):
మద్దూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహంలో (SC Boys Hostel) 2026-2027 నూతన విద్యా సంవత్సరానికి గానూ నూతన అడ్మిషన్లు (ప్రవేశాలు) ప్రారంభమైనట్లు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ (HWO) ముత్యాల చక్రధర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన ఈ నూతన అడ్మిషన్ల వివరాలను వెల్లడించారు.

**-పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి సర్కారు ఊతం..**

?ఈ సందర్భంగా వార్డెన్ ముత్యాల చక్రధర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల (ాజ) మరియు నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధి, సాధికారత కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా కృషి చేస్తోందని కొనియాడారు. దూరప్రాంతాల నుండి వచ్చి చదువుకునే పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ఉచిత హాస్టల్ వసతితో పాటు నాణ్యమైన భోజనాన్ని కల్పిస్తోందన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి గానూ 3వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుకునే విద్యార్థులు హాస్టల్‌లో చేరడానికి అర్హులని ఆయన స్పష్టం చేశారు. అడ్మిషన్ కొరకు కావలసిన ధృవీకరణ పత్రాలు: హాస్టల్ ప్రవేశం కోరదల్చిన విద్యార్థులు కింది జిరాక్స్ కాపీలు మరియు సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు: ?ఆధార్ కార్డు (విద్యార్థిది) ?కుల ధ్రువీకరణ పత్రం (Caste Certificate) ఆదాయ ధ్రువీకరణ పత్రం (Income Certificate) బోనఫైడ్ సర్టిఫికెట్ (ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుండి తీసుకున్నది) పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు మద్దూరు మండల పరిధిలోని అలాగే చుట్టుపక్కల గ్రామాల్లోని అర్హులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ ప్రభుత్వ ఉచిత వసతి, విద్యా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు స్థానిక హాస్టల్ అధికారులను సంప్రదించాలని ముత్యాల చక్రధర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## దానంపల్లిలో డ్వాక్రా నిధుల గోల్‌మాల్ కలకలం

**-రూ. కోటి పైగా నిధులు మాయమయ్యాయంటూ మహిళల ఆరోపణలు సీఏ లింగాల మమతపై ఫిర్యాదులు..**

**-చేర్యాల ఎస్‌బీఐ ఎదుట బాధితుల ధర్నా బ్యాంకులోకి వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు, సిబ్బంది**



చేర్యాల (హిందూస్తాన్ మీడియా):
చేర్యాల మండలం దానంపల్లి గ్రామంలో డ్వాక్రా మహిళల నిధుల వ్యవహారం తీవ్ర వివాదాస్పదంగా మారింది. గ్రామానికి చెందిన పలు డ్వాక్రా సంఘాల మహిళలు తమ గ్రూపుల పేర్లపై వచ్చిన రుణ నిధులు, పొదుపు ఖాతాలకు సంబంధించిన భారీ మొత్తాలు గల్లంతయ్యాయని ఆరోపిస్తూ మంగళవారం చేర్యాలలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట ఆందోళనకు దిగారు. బాధిత మహిళల కథనం ప్రకారం, గ్రామంలోని సుమారు 23 డ్వాక్రా సంఘాలకు సంబంధించిన రుణాలు, నిధుల లావాదేవీలను పర్యవేక్షిస్తున్న సీఏ (కమ్యూనిటీ అసిస్టెంట్) లింగాల మమత తమకు తెలియకుండా నిధులను ఇతర ఖాతాలకు మళ్లించారని ఆరోపించారు. మొత్తం వ్యవహారంలో రూ. కోటి రూపాయలకు పైగా అక్రమ లావాదేవీలు జరిగి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.మమత తో పాటు రాధిక, దేవయ్య ల హస్తం కూడా ఉన్నట్లు మహిళలు ఆరోపిస్తున్నారు. బ్యాంకు వద్ద ఉద్రిక్తత నిధుల గల్లంతు విషయమై సమాధానం కోరేందుకు పెద్ద సంఖ్యలో మహిళలు చేర్యాల ఎస్‌బీఐ బ్యాంకుకు చేరుకున్నారు. బ్యాంకు అధికారులను నిలదీసేందుకు మహిళలు లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు మరియు బ్యాంకు సిబ్బంది వారిని అడ్డుకున్నారు. దీంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మహిళలు బ్యాంకు ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తూ, తమ డబ్బులు ఎక్కడికి వెళ్లాయో వెల్లడించాలని డిమాండ్ చేశారు. "బ్యాంకు అధికారుల ప్రమేయం లేకుండా ఇంత పెద్ద మొత్తంలో లావాదేవీలు ఎలా జరిగాయి?" అంటూ ప్రశ్నించారు.

**-సమగ్ర విచారణకు డిమాండ్**

ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. తమ ఖాతాల్లో జరిగిన ప్రతి లావాదేవీ వివరాలను వెల్లడించి, నష్టపోయిన మహిళలకు న్యాయం చేయాలని కోరుతున్నారు. సీఏ మమత ఆత్మహత్యాయత్నం చేసినట్లు సమాచారం డ్వాక్రా మహిళల నుంచి ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో సీఏ లింగాల మమత ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. "డ్వాక్రా మహిళల డబ్బులు ఎక్కడికి వెళ్లాయి..?" "రూ. కోటి నిధుల వ్యవహారంలో అసలు నిజాలు ఏమిటి..?" అనే ప్రశ్నలు ప్రస్తుతం దానంపల్లి, చేర్యాల పరిసర ప్రాంతాల్లో చర్చనీయాంశంగా మారాయి. పోలీసుల దర్యాప్తు, అధికారుల విచారణలో అసలు వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

## అంబేద్కర్ ఆశయాలు సమాజానికి మార్గదర్శకం డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి



హిందూస్తాన్ మీడియా, కొమురవెల్లి:
సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం రాంసాగర్ గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఇటీవలే నిర్వహించబడింది. అనంతరం మంగళవారం రోజు స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి రాంసాగర్ గ్రామానికి విచ్చేసి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, అంబేద్కర్ సంఘం సభ్యులు ఎమ్మెల్యే కి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భారతదేశ ప్రజాస్వామ్యానికి బలమైన పునాదులు వేసిన మహనీయుడని అన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం, సోదరభావం వంటి విలువలను సమాజంలో నెలకొల్పేందుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని, యువత విద్యను ఆయుధంగా చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అక్కెనపల్లి రాజలక్ష్మి మల్లా రెడ్డి, ఉప సర్పంచ్ ఏసీ రెడ్డి మల్లారెడ్డి, నాయకులు అక్కెనపల్లి నరేందర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, యాదవ రెడ్డి, నర్సింహా రెడ్డి, హైటెక్ శీను, చింతల కరుణాకర్, బీరప్ప రాజయ్య, మండల నాయకులు, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షులు మైపాల్, గుజ్జ నర్సింలు, మాజీ ఉప సర్పంచ్ నీరటి నర్సింలు తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

# బిజినెస్

# ఎన్‌టీపీసీ నుంచి రూ.1,338 కోట్ల ఆర్డర్



హైదరాబాద్ :
ఎన్‌టీపీసీ అనుబంధ సంస్థ ఎన్‌టీపీసీ రెన్యువబుల్ ఎనర్జీ నుంచి రూ.1,388 కోట్ల విలువైన భారీ ఆర్డర్‌ను బొండాడ ఇంజనీరింగ్ లిమిటెడ్ దక్కించుకుంది. ఈ ఆర్డర్ కింద ఉత్తర ప్రదేశ్‌లోని సీతాపూర్ వద్ద ఎన్‌టీపీసీ రెన్యువబుల్ ఎనర్జీ ఏర్పాటు చేస్తున్న 250 మెగావాట్ల సామర్థ్యం గల సౌర విద్యుదుత్పత్తి ప్రాజెక్ట్‌ను ఈపీసీ పద్ధతిలో ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా 50 మెగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుదుత్పత్తి ప్రాజెక్ట్‌తో పాటు 200 మెగావాట్ల సామర్థ్యంతో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ (బీఈఎ?సఎ?స)ను కంపెనీ అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టును 18 నెలల కాలంలో పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపింది.

# 2031 నాటికి భారత్‌లో 110 కోట్లకు 5జీ కనెక్షన్లు

న్యూఢిల్లీ:
భారత్‌లో 2031 చివరి నాటికి 5జీ సబ్‌స్క్రిప్షన్ల సంఖ్య 110 కోట్లు దాటే అవకాశం ఉందని స్వీడన్‌కు చెందిన టెలికాం గేర్ తయారీ సంస్థ ఎరిక్సన్ నివేదిక అంచనావేసింది. అప్పటికి దేశంలోని మొత్తం చందాదారుల్లో వీటి వాటా 81 శాతం ఉండవచ్చని పేర్కొంది. 2025 చివరినాటికి దేశంలో 5జీ కనెక్షన్లు 43 కోట్లకు చేరుకున్నాయి. మొత్తం మొబైల్ సబ్‌స్క్రిప్షన్లలో వీటి వాటా 35 శాతంగా ఉందని ఎరిక్సన్ మొబిలిటీ నివేదిక పేర్కొంది. మొబైల్ డేటా వినియోగంలోనూ భారత్ దూసుకుపోతోంది. ఇప్పటికే నెలకు సగటున వినియోగం 37 జీబీలుగా ఉంది. ఇది 2031 నాటికి దాదాపు రెండింతలు పెరిగి 70 జీబీలకు చేరుకోనుందని అంచనా. దేశంలో 5జీ వినియోగం వేగంగా పెరుగుతుండటం, అందుబాటు ధరల్లో 5జీ స్మార్ట్ ఫోన్లు లభించడమే ఇందుకు కారణం.




# సూచీలకు జోష్..
## రెండో రోజూ కొనసాగిన లాభాలు

ఇరాన్-అమెరికా మధ్య శాంతి ఒప్పందం కుదరడంతో వరుసగా రెండో రోజూ కూడా దేశీయ సూచీలు లాభాలు ఆర్జించాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడాయిల్ ధర 0.32 శాతం తగ్గి 82.90 డాలర్లకు చేరుకుంది. మరోవైపు డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ (94.56) బలపడింది. సోమవారం విదేశీ మదుపర్లు రూ.200 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. ఈ సానుకూల సంకేతాల నేపథ్యంలో వరుసగా రెండో రోజు కూడా సెన్సెక్స్, నిఫ్టీ లాభాలతోనే రోజును ముగించాయి .




గత సెషన్ ముగింపు (76,264)తో పోల్చుకుంటే మంగళవారం ఉదయం దాదాపు 300 పాయింట్ల లాభంతో మొదలైన సెన్సెక్స్ రోజంతా అదే జోష్‌ను కొనసాగించింది. చివరకు 544 పాయింట్ల లాభంతో 76,808 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 135 పాయింట్ల లాభంతో 23,989 వద్ద స్థిరపడింది . సెన్సెక్స్, నిఫ్టీలో పీజీ ఎలక్ట్రోప్లాస్ట్, కోఫోర్జ్, సుజ్లాన్ ఎనర్జీ, హెచ్‌సీఎల్ టెక్, ఎస్బీఐ కార్డ్ మొదలైన షేర్లు లాభాలు ఆర్జించాయి . నాల్కో, యూనో మిండా, విశాల్ మెగామార్ట్, హిందాల్కో, హ్యుందాయ్ మోటార్స్ మొదలైన షేర్లు నష్టాలు మూటగట్టుకున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 98 పాయింట్లు లాభపడింది. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 252 పాయింట్లు ఆర్జించింది.

# గుజరాత్ టైటాన్స్ బౌలర్‌కు గుడ్ న్యూస్.. టీమిండియాకు ఎంపిక





స్పోర్ట్స్ డెస్క్:
గుజరాత్ టైటాన్స్ పేసర్ అశోక్ వర్మకు జాక్‌పాట్ తగిలింది. శ్రీలంకలో జరుగుతున్న ముక్కోణపు వన్డే సిరీస్ కోసం టీమిండియా-ఎ జట్టు నుంచి పిలుపు వచ్చింది. గాయపడిన యధ్వీర్ స్థానంలో అశోక్ ను ఎంపిక చేస్తూ బీసీసీఐ నిర్ణయం తీసుకుంది. దీంతో అతడు వెంటనే శ్రీలంకకు బయల్దేరనున్నాడు. ఇప్పటికే రెండు ఓటములతో ఫైనల్ అవకాశాలను భారత్-ఎ జట్టు సంక్లిష్టం చేసుకుంది. ఈ నేపథ్యంలో జట్టులోకి అశోక్ వర్మ ఎంట్రీ బలం చేకూరుస్తుందని క్రీడా నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. బుధవారం(జూన్ 17న) అఫ్గానిస్థాన్‌తో జరగనున్న మ్యాచ్‌లో అశోక్ శర్మ ఆడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.అశోక్ వర్మ ఐపీఎల్ 2026లో గుజరాత్ టైటాన్స్ తరఫున ప్రాతినిధ్యం వహించాడు. ఈ సీజన్‌లో అశోక్ వర్మ గంటకు 154 కిలోమీటర్ల వేగంతో బంతులు విసరడం విశేషం. ఐపీఎల్ 2026లో 10.85 సగటుతో ధారాళంగా పరుగులు ఇచ్చి.. కేవలం 6 వికెట్లే తీశాడు. అతడి వేగవంతమైన బౌలింగ్ కారణంగానే ఇవాళ భారత్-ఏ జట్టులోకి పిలుపు వచ్చేలా చేసిందని క్రీడా నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఇక యుధ్వీర్ సింగ్ విషయానికి వస్తే.. అతడు భుజం గాయంతో టీమిండియా-ఎ ఆడిన మూడు మ్యాచ్‌లకు దూరంగా ఉన్నాడు. ప్రాక్టీస్ సమయంలో బౌలింగ్ వేయడంలో ఇబ్బంది పడిన యధ్వీర్ బెంచ్‌కే పరిమితమయ్యాడు. దీంతో అతడి స్థానంలో అశోక్ శర్మకు చోటు లభించింది. గాయంతో బాధపడుతున్న యుధ్వీర్ బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కు రావాలని బీసీసీఐ తెలిపింది.

-భారత-ఏ జట్టు:
తిలక్ వర్మ (కెప్టెన్), రుతురాజ్ గైక్వాడ్ (వైస్ కెప్టెన్), ప్రియాంశ్ ఆర్య, వైభవ్ సూర్యవంశీ, ఆయుశ్ బదోని, నిషాంత్ సింధు, సూర్యాంశ్ షెడ్జే, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్), కుమార్ కుషాగ్రా, అర్ష్ ఖనబ్, విప్రరాజ్ నిగమ్, విప్రారాజ్ నిగమ్, అనుకుల్ రాయ్, అశోక్ శర్మ.

# మెస్సి కోసం ప్రపంచం మొత్తం ఎదురుచూస్తోంది: అర్జెంటీనా కోచ్

ఇంటర్నెట్ డెస్క్:
ఫిఫా ప్రపంచ కప్ 2026లో భాగంగా బుధవారం డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా తమ తొలి మ్యాచ్ ఆడనుంది. గ్రూప్-ఐలో ఉన్న అర్జెంటీనా జట్టు అల్జీరియాతో తలపడనుంది. ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సికి ఇది 200వ అంతర్జాతీయ మ్యాచ్ కావడం విశేషం. ఈ ఫిఫా ప్రపంచ కప్ మెస్సికి ఆఖరిదంటూ వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. దీంతో మెస్సిని మైదానంలో చూడాలని అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. కొంతకాలంగా కండరాల గాయంతో ఇబ్బందిపడుతున్న మెస్సి. పూర్తి ఫిట్‌నెస్ సాధించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అర్జెంటీనా ప్రధాన కోచ్ లియోనెల్ స్కలోని. మెస్సిపై ప్రశంసలు కురిపించాడు. ప్రపంచ మొత్తం మెస్సి కోసం ఎదురుచూస్తోందని తెలిపాడు. అర్జెంటీనా అభిమానులు మాత్రమే కాదు.. ప్రపంచం మొత్తం మెస్సిని మైదానంలో చూడాలని కోరుకు ంటోంది. అతడు కేవలం మా జట్టుకే కాదు ప్రపంచ ఫుట్‌బాల్‌కే ప్రత్యేక ఆకర్షణ. అతడి గురించి ప్రతికూలంగా చెప్పడానికి ఏమీ లేదు. మెస్సి ఎప్పుడూ జట్టుకు అండగా నిలిచాడు. జట్టు విజయాల్లో అతడి పాత్రే అత్యంత కీలకం. మెస్సి ఫుట్‌బాల్ దేవుడు అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు' అని స్కలోని వెల్లడించాడు. ఇదిలా ఉండగా, ఖతార్ వేదికగా జరిగిన ఫిఫా ప్రపంచ కప్ 2022 టైటిల్‌ను అర్జెంటీనా సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. మరోసారి టైటిల్‌ను నిలబెట్టుకోవాలనే లక్ష్యంతో బరిలోకి దిగనుంది. మెస్సి సహచరుడు నికోలస్ ఒటమెండీ ఈ సందర్భంగా మాట్లాడాడు. 'ఖతార్‌లో సాధించిన విజయం దేశాన్ని ఒక్కటిగా నిలిపింది. ఆ జ్ఞాపకాలు మాకు మరింత బలాన్ని స్తున్నాయి. అదే పట్టుదలతో మళ్లీ బరిలోకి దిగనున్నాం. అయితే మెస్సితో కలిసి ఆడటం నాకు గర్వంగా అనిపిస్తు ంటుంది. అతడు సాధారణ వ్యక్తి కాదు..




మైదానంలో మెస్సి ఓ యోధుడు' అని పేర్కొన్నాడు.

# స్పోర్ట్స్

## ఫిఫా ప్రపంచ కప్: భారత సంతతి ఆటగాడి అరుదైన ఘనత



ఇంటర్నెట్ డెస్క్:
ఫిఫా ప్రపంచ కప్ 2026లో న్యూజిలాండ్ ప్లేయర్ సర్‌ప్రీత్ సింగ్ అరుదైన ఘనత సాధించాడు. ప్రపంచ కప్ మ్యాచ్ తుది జట్టులో చోటు దక్కించుకున్న తొలి భారత సంతతి ఆటగాడిగా నిలిచాడు. న్యూజిలాండ్ తరఫున బరిలోకి దిగిన అతడు ఇరాన్‌పై జరిగిన మ్యాచ్ మొత్తం ఆడి చరిత్ర సృష్టించాడు.సర్‌ప్రీత్ సింగ్ న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌లో జన్మించాడు. అయితే అతడి తల్లిదండ్రుల స్వస్థలం పంజాబ్. 27 ఏళ్ల ఈ అటాకింగ్ మిడ్‌ఫీల్డర్‌ను న్యూజిలాండ్ కోచ్ డారెన్ బెజెలీ ఇరాన్‌తో కీలక మ్యాచ్‌లో స్టార్టింగ్ ఎలెవన్‌లోకి ఎంపిక చేశాడు. నంబర్ 10 జెర్సీలో బరిలోకి దిగిన సర్‌ప్రీత్.. 90వ నిమిషం వరకు మైదానంలో కొనసాగాడు. ఇరాన్ గోల్‌పోస్ట్‌పై మూడుసార్లు ప్రయత్నాలు చేయగా.. 61వ నిమిషంలో చేసిన షాట్ గోల్ కీపర్‌ను దాటలేకపోయింది. చివరకు ఈ మ్యాచ్ 2-2తో డ్రాగా ముగిసింది.అంతకుముందు భారత సంతతి ఆటగాడు నిషాన్ వెలుపిళ్లై ఆస్ట్రేలియా తరఫున ప్రపంచ కప్‌లో అరంగేట్రం చేశాడు. కానీ తుది జట్టులో కాకుండా సబ్‌స్టిట్యూట్ ప్లేయర్‌గా బరిలోకి దిగాడు. దీంతో స్టార్టింగ్ ఎలెవన్‌లో చోటు దక్కించుకున్న తొలి భారత సంతతి ప్లేయర్‌గా సర్‌ప్రీత్ సింగ్ రికార్డు నెలకొల్పాడు. ఇక వరల్డ్ కప్‌లో భారత మూలాలు కలిగిన ఆటగాళ్లలో వికాస్ ధోరసూ పేరు ముందుగా వినిపిస్తుంది. 2006లో ఫ్రాన్స్ తరఫున ఆడిన అతడి కుటుంబ సభ్యుల స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం. అయితే అతడు రెండు మ్యాచ్‌ల్లో ప్రత్యామ్నాయ ఆటగాడిగా మాత్రమే బరిలోకి దిగాడు.

## పెళ్లి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన శ్రీముఖి

-సరైన వ్యక్తి కోసం ఎదురుచూస్తున్నానన్న శ్రీముఖి
-తాను కోరుకున్న వ్యక్తి దొరికిన వెంటనే పెళ్లి చేసుకుంటానని వెల్లడి
-త్వరలోనే గుడ్ న్యూస్ చెప్పండి అంటూ నెటిజన్ల స్పందన



యాంకర్, నటి శ్రీముఖి తన పెళ్లి గురించి చేసిన సరదా వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. సమంత తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో ఆమె మాట్లాడుతూ... "ఈ సినిమా ప్రారంభమైనప్పుడు సమంత పెళ్లి జరిగింది. ఇప్పుడు సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా పెద్ద బ్లాక్‌బస్టర్ అయితే నా పెళ్లి కూడా జరగాలని కోరుకుంటున్నాను" అని నవ్వుతూ వ్యాఖ్యానించింది. సరైన పెళ్లి కొడుకు కోసం ఎదురుచూస్తున్నానని, దొరికిన వెంటనే పెళ్లి చేసుకుంటానని తెలిపింది. ఈ సందర్భంగా ప్రేక్షకులు, సినీ ప్రముఖులు చప్పట్లతో స్పందించగా, అభిమానులు సోషల్ మీడియాలో ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. కొందరు "త్వరలో గుడ్ న్యూస్ చెప్పండి" అంటూ సరదా కామెంట్లు చేస్తున్నారు. కాగా, దర్శకురాలు నందినీ రెడ్డి తెరకెక్కించిన 'మా ఇంటి బంగారం' జూన్ 19న విడుదల కానుంది. ఈ చిత్రంలో శ్రీముఖ కీలక పాత్ర పోషించింది.

# 12 ఏళ్లుగా ల్యాబ్‌కే పరిమితమైన త్రిష సినిమా ఇప్పుడు విడుదలకు రెడీ!



సౌత్ ఇండియన్ స్టార్ హీరోయిన్ త్రిష గురించి ఎంత చెప్పినా తక్కువే. హారర్, కామెడీ, క్రైమ్, లేడీ ఓరియంటెడ్.. ఇలా ఏ జోనర్ అయినా తన మార్క్ నటనతో మెప్పిస్తూ దశాబ్దాలుగా అగ్రశ్రేణి హీరోయిన్‌గా రాణిస్తోంది. అయితే, ఇటీవల తమిళనాడు రాజకీయాల్లో జరిగిన కీలక మార్పులు, ముఖ్యంగా దళపతి విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరుణంలో.. విజయ్‌తో త్రిష రిలేషన్ గురించిన రూమర్స్ సోషల్ మీడియాలో ఏ రేంజ్‌లో వైరల్ అయ్యాయో మనందరికీ తెలిసిందే. ఈ పొలిటికల్, పర్సనల్ బజ్ వల్ల తమిళనాడు మార్కెట్‌లో త్రిష క్రేజ్ ఒక్కసారిగా పీక్స్‌కు చేరింది. ఇప్పుడు ఇదే క్రేజ్‌ను క్యాష్ చేసుకునేందుకు.. ఏకంగా 12 ఏళ్లుగా ల్యాబ్‌కే పరిమితమైన త్రిష పాత సినిమాను థియేటర్లలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. త్రిష, అరవింద్ స్వామి లీడ్ రోల్స్‌లో నిర్మల్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'శతురంగ వెట్టై-2'. నిజానికి ఈ సినిమా షూటింగ్ 2014లోనే పూర్తయింది. కానీ ఆ సమయంలో నిర్మాతలకు ఎదురైన తీవ్ర ఆర్థిక సమస్యల కారణంగా ఈ ప్రాజెక్ట్ రిలీజ్ కాకుండా అటకెక్కింది. ఇన్నేళ్లపాటు ఈ సినిమాను ఎవరూ పట్టించుకోలేదు. కానీ, ప్రస్తుతం తమిళనాడులో త్రిషకు ఉన్న విపరీతమైన క్రేజ్, పొలిటికల్ కనెక్టివిటీ నేపథ్యంలో.. ఈ క్రైమ్ థ్రిల్లర్‌ను థియేటర్లలోకి వదిలితే కచ్చితంగా భారీ కలెక్షన్స్ రాబట్టవచ్చని చిత్ర బృందం గట్టిగా అంచనా వేస్తోంది. అందుకే 12 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత 'శతురంగ వెట్టై-2'ను రిలీజ్ చేసేందుకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో టాక్ నడుస్తోంది.

# స్టార్‌డమ్‌తో నాలో అహంకారం పెరిగింది: సమంత

-స్టార్‌డమ్‌ను చూసి ఆశ్చర్యపోయానన్న సమంత
-వరుస హిట్లతో స్టార్‌డమ్‌కు బానిసయ్యానని వ్యాఖ్య
-నటిగా అహంకారం పెరిగి తనకు ముగింపు లేదనుకున్నానని వెల్లడి
-అనారోగ్యంతో తీసుకున్న విరామం ఆలోచనలను మార్చిందన్న హీరోయిన్
-జూన్ 19న ప్రేక్షకుల ముందుకు 'మా ఇంటి బంగారం' సినిమా

స్టార్‌డమ్ మత్తులో తాను కూడా కొట్టుకుపోయానని, వరుస విజయాలు తనలో అహంకారాన్ని పెంచాయని ప్రముఖ నటి సమంత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అనారోగ్య వల్ల ఇటీవల తీసుకున్న విరామం తన జీవితాన్ని, కెరీర్‌ను కొత్త కోణంలో చూసేలా చేసిందని వెల్లడించారు.'మా ఇంటి బంగారం' సినిమా విడుదలకు సిద్ధమవుతున్న సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సమంత తన సినీ ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. "చిన్న పట్టణం నుంచి వచ్చిన ఓ అమ్మాయిగా స్టార్‌డమ్‌ను అనుభవించడం నాకు ఆశ్చర్యంగా అనిపించింది. ప్రేక్షకులు నా పేరును అరుస్తూ, నా సినిమాల కోసం ఎదురుచూడటం చూసి మరింత కష్టపడ్డాను. ఓ దశలో స్టార్‌డమ్ అనే ఆటకు బానిసయ్యాను. ఏడాదిలో ఐదు సినిమాలు చేశాను. అవన్నీ హిట్లు కావడంతో నాకో 'గోల్డెన్ లెగ్' ఉందని అందరూ అనేవారు. ఆ అంచనాలకు తగ్గట్టుగా ఉండాలనే ఒత్తిడిని నేనే నాపై పెట్టుకున్నా" అని చెప్పారు."అప్పుడు నేను చాలా బిజీగా ఉన్నాను. ఇంకా ఎక్కువ సినిమాలు చేయాలనుకునేదాన్ని. నటిగా నాకు ముగింపు ఉండదనుకున్నాను. అదే ఒక రకమైన అహంకారం. కానీ ఆ విరామం తర్వాత నా కెరీర్‌కూ ఓ ముగింపు ఉంటుందనే విషయాన్ని అర్థం చేసుకున్నా. అది నా ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చింది. తిరిగి సినిమాల్లోకి వస్తే కొన్ని పాత అలవాట్లు మార్చుకోవాలని అప్పుడే నిర్ణయించుకున్నా' అని సమంత తెలిపారు. 2022లో తాను మయో సైటిస్ అనే ఆటో ఇమ్యూన్ వ్యాధితో బాధపడు తున్నట్లు సమంత వెల్లడించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆమె నటించిన 'మా ఇంటి



బంగారం' చిత్రం జూన్ 19న విడుదల కానుంది.

## 'డార్లింగ్ సీఎం విజయ్'.. హీరో విశాల్ ఆసక్తికర పోస్ట్



తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను ఇటీవల కలిసిన నటుడు, నిర్మాత విశాల్ 'డార్లింగ్ సీఎం విజయ్' అంటూ చేసిన సోషల్ మీడియా పోస్ట్ అభిమానులను ఆకట్టుకుంటోంది. లయోలా కాలేజీ రోజుల నుంచే విజయ్‌ను తాను 'డార్లింగ్' అని పిలుస్తున్నానని చెప్పారు. ఇప్పటికీ అదే పిలుపు కొనసాగుతోందని విశాల్ తెలిపారు.సోషల్ మీడియాలో పంచుకున్న సందేశంలో విజయ్ సినీ రంగంలో ఎదిగిన తీరు తనను ఎంతగానో ఆకట్టుకుందని పేర్కొన్నారు. ఓ యువ నటుడిగా ప్రారంభమైన ఆయన ప్రయాణం సూపర్‌స్టార్ స్థాయికి చేరిందని కొనియాడారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం గొప్ప విషయమన్నారు. ఎన్నో విమర్శలు, సవాళ్లను మౌనంగా ఎదుర్కొంటూ విజయాన్ని సాధించారని కొనియాడారు. ముఖ్యమంత్రి పదవి వచ్చినా విజయ్ వ్యక్తిత్వంలో ఎలాంటి మార్పు రాలేదని విశాల్ వెల్లడించారు. చాలా ఏళ్ల క్రితం ఎలా కలిసేవారో, ఇప్పటికీ అదే ఆప్యాయత కనిపించిందన్నారు. గతంలో కరుణానిధి, జయలలిత, స్టాలిన్, ఉదయనిధి వంటి నేతలతో తనకు ఉన్న అనుబంధాన్ని కూడా ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

# బాక్సాఫీస్ వద్ద దయ్యాల జాతర.. థియేటర్లలో వణుకుతున్న జనాలు.. కలెక్షన్ల సునామీ!

ప్రస్తుతం భారతీయ బాక్సాఫీస్ వద్ద హారర్ జానర్ చిత్రాలు సంచలనాలు సృష్టిస్తున్నాయి. స్టార్ హీరోల భారీ బడ్జెట్ సినిమాలు సైతం కలెక్షన్ల కోసం ఇబ్బంది పడుతున్న తరుణంలో.. విక్రమ్ భట్ సరికొత్త హారర్ థ్రిల్లర్ 'హాంటెడ్ 3ఊ: ఎకోస్ ఆఫ్ ది పాస్ట్', హాలీవుడ్ సంచలనం 'అబ్సెషన్' , ఏ24 ప్రొడక్షన్ నుంచి వచ్చిన 'బ్యాక్‌రూమ్స్'చిత్రాలు థియేటర్లలో కాసుల వర్షం కురిపిస్తున్నాయి. ప్రధాన మల్టీప్లెక్స్ చైన్లలో కొన్ని చట్టపరమైన ఇబ్బందుల వల్ల పెద్దగా స్క్రీన్లు దక్కకపోయినప్పటికీ సింగిల్ స్క్రీన్స్, బి, సి సెంటర్లలో హాంటెడ్ 3ఊ అద్భుతమైన వసూళ్లతో దూసుకు పోతోంది. మహాక్షయ్ చక్రవర్తి ప్రధాన పాత్రలో నటించిన 'హాంటెడ్ 3ఊ' చిత్రం జూన్ 12న విడుదలై.. మొదటి రోజే ఏకంగా రూ. 2.50 కోట్ల నెట్ కలెక్షన్లతో ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది. ఎలాంటి ఆఫర్లు లేకపోయినా కేవలం పాజిటివ్ టాక్ ) తో వీకెండ్ ముగిసేసరికి ఈ చిత్రం ఇండియాలో సుమారు రూ. 10 కోట్ల మార్కును దాటేసింది. కేవలం రూ. 15 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా చాలా త్వరగానే లాభాల బాట పట్టేలా కనిపిస్తోంది. ఇదిలా ఉంటే, ప్రముఖ యూట్యూబర్ కర్రీ బార్కర్ కేవలం ఒక మిలియన్ డాలర్ల కంటే తక్కువ బడ్జెట్‌తో తెరకెక్కించిన సైకలాజికల్ హారర్ చిత్రం 'అబ్సెషన్' ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే 200 మిలియన్ డాలర్లకు పైగా వసూలు చేసి చరిత్ర సృష్టించింది. ఈ చిత్రం ఇండియాలోనూ ఏకంగా రూ. 50 కోట్ల క్లబ్‌లో చేరి నిలకడైన వసూళ్లతో రన్ అవుతోంది.మరోవైపు, వైరల్ యూట్యూబ్ కాన్సెప్ట్ ఆధారంగా యువ క్రియేటర్ కేన్ పార్సన్స్ దర్శకత్వంలో వచ్చిన 'బ్యాక్‌రూమ్స్' సినిమా కూడా హాలీవుడ్ రోల్‌అవుట్‌లో భాగంగా ఇండియాలో అద్భుతమైన ఓపెనింగ్స్ సాధించింది. గత శుక్రవారం ఒక్క రోజే ఈ మూడు హారర్ చిత్రాలు కలిసి బాక్సాఫీస్ వద్ద సుమారు రూ. 6.75 కోట్ల గ్రాస్‌ను రాబట్టాయి. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలను తెచ్చిపెట్టే హారర్ జానర్‌కు



భారతీయ ప్రేక్షకులు ఎప్పుడూ బ్రహ్మరథం పడతారని ఈ తాజా కలెక్షన్ల ట్రెండ్ మరోసారి నిరూపించింది. థియేటర్లలో సీట్ల అక్యుపెన్సీ రోజురోజుకూ పెరుగుతుండటంతో అటు ఎగ్జిబిటర్లు, ఇటు నిర్మాతలు ఫుల్ ఖుషీ అవుతున్నారు.






Publisher: AKULA SWATHI , printed at SUNDAY PRINTING PRESS, FLAT. NO.363B,1st FLOOR,MADHAVARAM NAGAR COLONY ,RANGAREDDY, TELANGANA - 500072 .
Published at H.NO.15-56/1, Village & Mandal CHERIAL , SIDDIPET District ,Telangana state - 506223, Editor :THADEM PRASHANTH Cell :9000306455